RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 90 | ఏప్రిల్ 21 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 90 | April 21 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


బస్సు బోల్తాపడి 15మంది మృతి కాశ్మీర్‌లో ఘోర ఘటన 2

## కేసీఆర్ హయాంలోనే రీడిజైన్ పేరుతో
# భారీ అవినీతి

- సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- మేడిగడ్డ కుంగుబాటుతో అసలు బయటకు

కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టిన ముఖ్యమంత్రి

- మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులతో కలిసి

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలన



కాటారం జనసంఘర్షణ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. రీడిజైన్ పేరుతో కేసీఆర్ హయాంలో భారీ అవినీతి జరిగిందని, ప్రపంచంలోనే అద్భుతమని ప్రచారం చేసుకున్న ఈ ప్రాజెక్టు అసలు స్వరూపం మేడిగడ్డ కుంగుబాటుతో బయటపడిందని ఆయన ఆరోపించారు. సోమవారం మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 2020లోనే బ్యారేజీలో లోపాలు ఉన్నాయని ఇంజనీర్లు లేఖలు రాసినా, అప్పటి ప్రభుత్వం గానీ, కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ గానీ పట్టించుకోలేదని, కేవలం 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడానికే ప్రాజెక్టును వాడుకున్నారని విమర్శించారు. రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందలేదని, ఇప్పటికే లక్ష కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం వైఫల్యంపై సీబీఐ విచారణ కోరుతూ తాము కేంద్రానికి తీర్మానం పంపి, పదేపదే లేఖలు రాస్తున్నా

➤ మిగతా 2వ పేజీలో..

## భారత నౌకలకు కీలక హెచ్చరికలు

### జారీచేసిన భారత నౌకదళం



న్యూఢిల్లీ జనసంఘర్షణ
హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత నౌకాదళం తన నౌకలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. భారత జెండాతో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరిపిన ఘటనను తీవ్రంగా పరిగణించిన నేవీ, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించవద్దని నౌకలకు సూచించింది. ముఖ్యంగా లారక్ ఐలాండ్‌కు దూరంగా ఉండాలని భారత జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 11 నౌకలు ఈ మార్గం గుండా వెళ్లగా, చివరిగా

➤ మిగతా 2వ పేజీలో..

## ప్రధాని ప్రారంభోత్సవానికి ముందు అగ్ని ప్రమాదం



జైపూర్ జనసంఘర్షణ
రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్ర రిఫైనరీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సరిగ్గా మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా, అంతకు ఒకరోజు ముందే ఈ ప్రమాదం చోటుచేసుకోవడం సర్వత్రా ఆందోళనకు దారితీస్తోంది. ప్రమాద తీవ్రత కారణంగా వందల అడుగుల ఎత్తు వరకు నల్లటి పొగ ఆకాశాన్ని కమ్మేసింది. సమాచారం అందుకున్న వెంటనే భారీ సంఖ్యలో ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి

## మళ్లీ ఉద్యమ నాటి
# చీకటి రోజులు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యల సుడిగుండం
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను దగా
- జగిత్యాల సభలో నిప్పులు చెరిగిన కేసీఆర్



జగిత్యాల జనసంఘర్షణ
తెలంగాణలో మళ్లీ ఉద్యమ నాటి చీకటి రోజులు దాపురించాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రాష్ట్రం సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు విమర్శించారు. సోమవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను దగా చేసిందని ధ్వజమెత్తారు. ఈ సభలోనే కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. జీవన్ రెడ్డితో తమకు 45 ఏళ్ల అనుబంధం ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసమే ఆయన గుండె ధైర్యంతో

➤ మిగతా 2వ పేజీలో..

## జపాన్‌లో సోమవారం భారీ భూకంపం



టోక్యో జనసంఘర్షణ
జపాన్‌లో సోమవారం భారీ భూకంపం సంభవించింది, దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైందని అధికారులు వెల్లడించారు. ఈ భూకంప ధాటికి తీర ప్రాంతాల్లో సునామీ సంభవించే

➤ మిగతా 2వ పేజీలో..

## చర్చలకు హాజరుకానీ ఇరాన్

రేపటితో కాల్పుల విరమణ ఒప్పందం ముగింపు.. ప్రపంచ వ్యాప్తగా మళ్లీ ఉత్కంఠ

న్యూఢిల్లీ జనసంఘర్షణ
అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన రెండో దఫా శాంతి చర్చలు ప్రతిష్టంభనలోకి వెళ్లాయి. ఇస్లామాబాద్‌లో సోమవారం ప్రారంభం కావాల్సిన ఈ కీలక చర్చలకు తాము హాజరు కావడం లేదని ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అమెరికా నౌకాదళం తమకు చెందిన 'తౌస్కా' అనే వాణిజ్య నౌకను అక్రమంగా స్వాధీనం చేసుకోవడమే ఇందుకు ప్రధాన కారణమని టెహ్రాన్ పేర్కొంది. ఇరాన్ జెండాతో ప్రయాణిస్తున్న సదరు కార్గో షిప్‌పై అమెరికా దళాలు తొలుత కాల్పులు జరిపి, ఆపై తమ ఆధీనంలోకి తీసుకోవడాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. ఈ చర్యను తమ దేశంపై జరిగిన

➤ మిగతా 2వ పేజీలో..

కావాలనే సీఎం సభకు
## పోటీగా కేసీఆర్ సభ
### టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్




2

# కేసీఆర్ హయాంలోనే రీడిజైన్ పేరుతోభారీ అవినీతి

**మొదటిపేజీ తరువాయి..** కేంద్రం ఎందుకు స్పందించడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో విచారణ కోరిన కిషన్ రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. అవినీతి కేసుల నుండి తప్పించుకోవడానికే హరీష్ రావు, వినోద్ రావు ఢిల్లీకి వెళ్లి బీజేపీ నేతల కాళ్లు మొక్కుతున్నారని, వారి రహస్య పర్యటనల వెనుక ఉన్న మతలబును ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాలు బయటపడతాయనే భయంతోనే తాము మేడిగడ్డ పర్యటనకు వచ్చిన రోజే కేసీఆర్ జగిత్యాలలో సభ పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అయితే ప్రాజెక్టును అలాగే వదిలేస్తే రాష్ట్రానికి మరింత నష్టం జరుగుతుందన్న ఉద్దేశంతో, నిపుణుల సూచనలు మరియు ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా రిపేర్లు చేయించి నీటిని అందుబాటులోకి తెస్తామని సీఎం స్పష్టం చేశారు. హరీష్ రావుకు తెలివి ఉందో లేదో తెలియదని, ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రాముఖ్యతను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అంతకుముందు ముఖ్యమంత్రి దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.198 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భక్తుల సౌకర్యార్థం క్షేత్రాన్ని మరింత విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మేడిగడ్డ వద్ద క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులను పరిశీలించి, వర్షాకాలం లోపు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కాళేశ్వరం అవినీతిలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఎం పునరుద్ఘాటించారు.

# భారత నౌకలకు కీలక హెచ్చరికలు

**మొదటిపేజీ తరువాయి..** 'దేశ్ గరిమ' ట్యాంకర్ సురక్షితంగా దాటింది. అయితే అదే రోజు ప్రయాణించిన 'జగ్ అర్ణవ్', 'సన్మార్ హెరాల్డ్' నౌకలపై ఇరాన్ బలగాలు కాల్పులు జరపడం కలకలం రేపింది. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి వివరణ కోరింది. గతంలో భారత నౌకలకు ఇరాన్ సహకరించిన తీరును ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, ప్రస్తుత చర్యపై అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి కారణంగా భారత్‌కు చమురు సరఫరాలో అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. రష్యా నుంచి చమురు దిగుమతులను సులభతరం చేసేందుకు గాను 11 రష్యా బీమా సంస్థలకు భారత్‌లో సేవలందించేందుకు అనుమతులు మంజూరు చేసింది. సాధారణంగా అంతర్జాతీయ సముద్ర రవాణాలో 87 శాతం వాటా ఉన్న 'ఇంటర్నేషనల్ గ్రూప్ ఆఫ్ పీఅండ్ఐ క్లబ్స్' బీమా రక్షణ కల్పిస్తుంది. అయితే అమెరికా ఆంక్షల కారణంగా ఈ సంస్థ రష్యా నౌకలకు బీమా ఇవ్వదు. అందుకే గ్యాస్‌ప్రోమ్ ఇన్స్యూరెన్స్, రోస్‌గోస్‌స్ట్రాక్, స్బెర్‌బ్యాంక్ వంటి రష్యా సంస్థలకు భారత్ పచ్చజెండా ఊపింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు అనుమతులు పొడిగించడం భారత్‌కు సానుకూల అంశంగా మారింది. హర్మూజ్ జలసంధి దిగ్బంధం నేపథ్యంలో, ఎర్ర సముద్రం మీదుగా వచ్చే రష్యా చమురు నౌకలపై భారత్ ప్రస్తుతం ఎక్కువగా ఆధారపడుతోంది.

# ప్రధాని ప్రారంభోత్సవానికి ముందు అగ్ని ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** చేరుకుని మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే ఈ అగ్నిప్రమాదం జరగడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం అధికారులు అక్కడకు చేరుకుని పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో మంగళవారం నాటి ప్రధాని పర్యటనపై నీలినీడలు ముసురుకున్నాయి. చారిత్రక నేపథ్యం పరిశీలిస్తే, 2013 సెప్టెంబర్ 22న అప్పటి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ హయాంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో రూ. 37,230 కోట్ల అంచనా వ్యయంతో దీని పనులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, 2018 జనవరి 16న ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ఈ ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) మరియు రాజస్థాన్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టాయి. దేశంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ కావడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. ఎంతో కీలకమైన ఈ రిఫైనరీ ప్రారంభోత్సవానికి ముందే ఇలాంటి ప్రమాదం జరగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని రిషిక శ్రావ్య అత్యుత్తమ ప్రతిభ

**బోధన్ : ఏప్రిల్ 20 జన సంఘర్షణ** బోధన్ కేంద్రీయ విద్యాలయంలో మెరిసిన ముత్యాలు, కేంద్రీయ విద్యాలయానికి వన్నెతెచ్చిన విద్యాలయం అధ్యాపకులు తెలిపారు. బోధన్ పట్టణంలోని పాండు ఫారంలో గల పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరించింది. 10 సిబిఎస్ఈ బోర్డు రిజల్ట్ 2026 శనివారం విడుదలైన ఫలితాలలో బోధన్ పట్టణంలోని తట్టికోట్ కాలనీ కి





చెందిన దాసరి శ్రావ్య 96.8, రిషిక 94.2,చరిత 93.8శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యాలయంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రావ్య , శ్రావ్య , రిషిక లను, ఉపాధ్యాయులు అభిందించారు.

# మళ్లీ ఉద్యమ నాటి చీకటి రోజులు

**మొదటిపేజీ తరువాయి..** ఈ నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ఆయన చేరికతో పార్టీకి కొత్త ఊపు వచ్చిందని పేర్కొన్నారు. పాలనపై విమర్శలు గుప్పిస్తూ.. రెండేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ ఒక్క నిర్మాణాత్మక పని కూడా చేయలేదని, వ్యవసాయ రంగం కుదేలై మళ్లీ ఎరువుల కోసం చెప్పులు క్యూలో పెట్టాల్సిన దుస్థితి వచ్చిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు కష్టాలు మొదలయ్యాయని, తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథను మూలన పడేశారని మండిపడ్డారు. "పసిడి లాంటి తెలంగాణను అప్పగిస్తే సర్వనాశనం చేశారు" అంటూ రేవంత్ రెడ్డి పేరు ఎత్తకుండానే పాలనపై నిప్పులు చెరిగారు. తాను ఉద్యమ సమయంలో ఎన్నో అవమానాలు భరించి, ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించానని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కొందరు తన చావు కోరుకుంటున్నారని, కానీ తన చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు. రైతుబంధు, దళితబంధు వంటి పథకాలను కాంగ్రెస్ అటకెక్కించిందని, కేవలం 1.7 శాతం ఓట్ల తేడాతో ఓడిపోవడమే రాష్ట్రానికి శాపంగా మారిందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో 'హైడ్రా' పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని, తాము మళ్లీ అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తివేస్తూనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, కానీ పేదల ఇళ్లు కూల్చడం అన్యాయమని నిలదీశారు. ఢిల్లీ పాలకులకు మోకరిల్లి వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, దీనిపై యుద్ధం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# జపాన్‌లో సోమవారం భారీ భూకంపం

**మొదటిపేజీ తరువాయి..** అవకాశం ఉండటంతో జపాన్ వాతావరణ సంస్థ తక్షణమే సునామీ హెచ్చరికలను జారీ చేసింది. భూ ప్రకంపనల ప్రభావం ఎంత బలంగా ఉందంటే, కేంద్రానికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజధాని నగరం టోక్యోలోని భారీ భవనాలు కూడా ఒక్కసారిగా కంపించాయి. సముద్రంలో సుమారు పది అడుగుల (3 మీటర్ల) ఎత్తు వరకు అలలు ఎగసిపడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తొలి సునామీ అలలు ఇప్పటికే ఉత్తర తీరాన్ని తాకే అవకాశం ఉందని, ఈ అలలు పదేపదే వచ్చే ప్రమాదం ఉన్నందున హెచ్చరికలను ఉపసంహరించుకునే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి జపాన్ ప్రధానమంత్రి కార్యాలయం ప్రత్యేక సంక్షోభ నిర్వహణ బృందాన్ని రంగంలోకి దించింది. తీర ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే ఎత్తైన ప్రదేశాలకు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భూకంపం వల్ల కలిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సహాయక చర్యల కోసం అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ప్రజలు ఎప్పటికప్పుడు వెలువడే అధికారిక సూచనలను పాటించాలని ప్రభుత్వం కోరింది. అంతర్జాతీయ సమాజం కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.

# జమ్ముకాశ్మీర్‌లో ఘోర ప్రమాదం

## బస్సు బోల్తాపడి 15మంది మృతి

**శ్రీనగర్, ఏప్రిల్20 :** జమ్మూ కాశ్మీర్ కాగోర్ట్ సమీపంలోని రామ్‌నగర్-ఉదంపూర్ జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం వారిని ఉదంపూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకోగానే జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం కారణంగా బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రత్యక్ష సాక్ష్యులు వెల్లడించారు. సోమవారం రామ్‌నగర్ నుంచి ఉదంపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై ఉదంపూర్ జిల్లా ఉన్నతాధికారులతో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ప్రమాదంపై ఆయన ఆరా తీశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని
ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి అత్యవసర వైద్య సహాయం కోసం ఎయిర్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు సాధ్యమైన మేరకు అన్ని సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు.

# చర్చలకు హాజరుకానీ ఇరాన్

**మొదటిపేజీ తరువాయి..** నేరుగా దాడిగానే భావిస్తున్నామని, దీనికి త్వరలోనే తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 22వ తేదీతో ముగియనుంది. ఈ గడువు ముగిసేలోపు ఇస్లామాబాద్ చర్చల ద్వారా ఇరు దేశాల మధ్య శాంతి నెలకొంటుందని ప్రపంచ దేశాలు ఆశించినప్పటికీ, తాజా పరిణామాలతో ఆ ఆశలు అడుగంటాయి. అమెరికా వైఖరి వల్లే తాము చర్చల నుంచి వైదొలుగుతున్నామని, నౌకను స్వాధీనం చేసుకోవడం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఇరాన్ స్పష్టం చేసింది. దీనికి తోడు ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా విధిస్తున్న దిగ్బంధనం, శాంతి చర్చల పేరుతో అగ్రరాజ్యం పెడుతున్న కఠినమైన డిమాండ్లు కూడా ఇరాన్‌కు ఆగ్రహం కలిగిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రెండో విడత శాంతి చర్చలు ప్రారంభం కాకుండానే విఫలమైనట్లు కనిపిస్తోంది, ఇది అంతర్జాతీయంగా ఆందోళనకు దారితీస్తోంది.

## కావాలనే సీఎం సభకు

# పోటీగా కేసీఆర్ సభ

**మొదటిపేజీ తరువాయి..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సభకు పోటీగా, కావాలనే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభను ఏర్పాటు చేశారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి సభ షెడ్యూల్ 20 రోజుల ముందే ఖరారైందని గుర్తు చేశారు. కేసీఆర్‌కు కౌంటర్ ప్రోగ్రాంలు పెట్టాల్సిన అవసరం తమకు లేదని, ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించడం ఆయనకు పాత అలవాటేనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కేసీఆర్ ఏ విధమైన ఆశలు చూపించారో అర్థం కావడం లేదని, గతంలో కేకే, డీఎస్ వంటి నేతలు పడినట్లే జీవన్ రెడ్డి కూడా భవిష్యత్తులో బాధపడతారని అభిప్రాయపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్టులో కేసీఆర్ చేసిన మోసాల గురించి గతంలో తమకు పాఠాలు చెప్పిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే బీఆర్ఎస్ పార్టీకి కోరస్ పాడటం విచారకరమని పీసీసీ చీఫ్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసినప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంపై రాని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ఆయన జీవన్ రెడ్డిని నిలదీశారు. తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కోరుకున్నారని, రేవంత్ పోవాలి.. మార్పు రావాలి అనే హక్కు జీవన్ రెడ్డికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ అనే పులి ప్రస్తుతం ఫామ్ హౌస్‌కే పరిమితమైందని, గత పదేళ్లలో ఆ పులి మేసిన ఆవుల (అవినీతి) వివరాలను త్వరలోనే బయటపెడతామని మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మంటలు

## ఫైర్ సిబ్బంది రాకతో తప్పిన ముప్పు

**హైదరాబాద్, ఏప్రిల్20 :**
గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్ మొత్తం దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఈ ప్రమాదంలో సెల్లార్‌లోని 15 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# లెన్స్‌కార్ట్ 'ధర్మ' ద్రోహంపై భట్టు రమేష్ నిప్పులు!

- బొట్టుపై నిషేధమా.. భారత్‌లో బతుకుతూ భారతీయులనే వెలివేస్తారా?
- హిందూ ధర్మంపై వివక్షా? ఇల్లందులో భట్టు రమేష్ నిరసన జ్వాల!

ఇల్లందు ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

**వ్యాపారం భారత్.. విలువలపై వితండవాదమా?**

భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం. ఇక్కడ వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకున్న ఏ సంస్థ అయినా స్థానిక సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించడం కనీస ధర్మం. కానీ, ప్రముఖ ఐవేర్ దిగ్గజం 'లెన్స్‌కార్ట్' తాజాగా తీసుకున్న అంతర్గత నిర్ణయాలు చూస్తుంటే, ఆ సంస్థకు హిందూ ధర్మ చిహ్నాలపై ఎందుకంత చిన్నచూపు అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉద్యోగుల డ్రెస్ కోడ్ పేరుతో బొట్టు, తిలకం, రక్షా దారం వంటి పవిత్ర గుర్తులను నిషేధించడం అంటే.. అది కేవలం నిబంధన కాదు, హిందూ జీవన విధానంపై జరుగుతున్న దాడి అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ద్వంద్వ నీతిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న వేళ, ఇల్లందులో బిజెపి మండల అధ్యక్షులు భట్టు రమేష్ ఈ వివక్షపై గర్జించారు.



**'తిలకం మన సంస్కృతి.. అది నిషేధించడమేమిటి?'**

లెన్స్‌కార్ట్ సంస్థ తీరును తీవ్రంగా ఖండించిన భట్టు రమేష్, ఇది హిందూ సమాజాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. "మనం నుదుట పెట్టుకునే బొట్టు లేదా తిలకం కేవలం ఒక అలంకారం కాదు, అది మన ధర్మానికి, ఆత్మగౌరవానికి ప్రతీక. వేల ఏళ్ల సంస్కృతిని ప్రతిబింబించే ఈ చిహ్నాలను ఒక కార్పొరేట్ సంస్థ తన కార్యాలయాల్లో నిషేధించడం దారుణం. హిజాబ్, టర్బన్ వంటి వాటికి వెసులుబాటు కల్పిస్తూ, కేవలం హిందూ ధర్మ చిహ్నాలపైనే ఆంక్షలు విధించడం సంస్థలోని పక్షపాత ధోరణికి నిదర్శనం. ఇలాంటి వివక్షను ఏ భారతీయుడూ సహించకూడదు" అని ఆయన పిలుపునిచ్చారు.

**ఆలోచించండి.. మన ఆత్మాభిమానాన్ని తాకట్టు పెడదామా?**

ఈ సందర్భంగా భట్టు రమేష్ ప్రజలను ఉద్దేశించి ఆలోచింపజేసే ప్రశ్నలు సంధించారు. మన సంప్రదాయాలను గౌరవించని సంస్థలకు మనం ఎందుకు లాభాలు చేకూర్చాలి? మన మనోభావాలను దెబ్బతీసే వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా ఆ సంస్థల అహంకారాన్ని పెంచినట్టే అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "వ్యాపారం కోసం భారతీయుల సొమ్ము కావాలి కానీ, భారతీయుల సంస్కృతి మాత్రం వద్దంటే ఎలా? లెన్స్‌కార్ట్ వస్తువులను బహిష్కరించడం ద్వారానే ఇలాంటి సంస్థలకు బుద్ధి వస్తుంది. మన ధర్మాన్ని కించపరిచే ప్రతి చర్యను మనం ఐక్యమత్యంతో




తిప్పికొట్టాలి" అని ఆయన గట్టిగా హెచ్చరించారు.

**నిరసన జ్వాల.. మార్పు దిశగా అడుగులు!**

ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఉప్పెనలా ఎగిసిపడుతున్న 'బహిష్కరణ' నిరసనలో ఇల్లందు నుంచే గొంతుక వినిపించిన భట్టు రమేష్, ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపబోమని స్పష్టం చేశారు. లెన్స్ కార్ట్ వస్తువులను ఎవరు కొనుగోలు చేయొద్దు అని పిలుపునిచ్చారు. కార్పొరేట్ సంస్థలు కేవలం లాభాల వేటలోనే కాకుండా, సామాజిక విలువలను, మెజారిటీ ప్రజల విశ్వాసాలను గౌరవించడంలో కూడా బాధ్యతగా ఉండాలని ఈ కథనం ద్వారా మనం గ్రహించాల్సిన అవసరం ఉంది. మన సంస్కృతే మన గుర్తింపు.. దాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

# కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని రిషిక శ్రావ్య అత్యుత్తమ ప్రతిభ..

బోధన్ : ఏప్రిల్ 20 జన సంఘర్షణ

బోధన్ కేంద్రీయ విద్యాలయంలో మెరిసిన ముత్యాలు, కేంద్రీయ విద్యాలయానికి వన్నెతెచ్చిన విద్యాలయం అధ్యాపకులు తెలిపారు. బోధన్ పట్టణంలోని పాండు ఫారంలో గల పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరించింది. 10 సిబిఎస్ఈ బోర్డు రిజల్ట్ 2026 శనివారం విడుదలైన ఫలితాలలో బోధన్ పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన దాసరి శ్రావ్య 96.8, రిషిక 94.2, చరిత 93.8 శాతం మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యాలయంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శ్రావ్య , రిషిక లను ఉపాధ్యాయులు అభిందించారు.


రిషిక


శ్రావ్య

# విద్యా వ్యాపారంపై 'ఫార్వర్డ్ బ్లాక్' గర్జన

- సామాన్యుడి బతుకు ఆగం చేస్తున్న కార్పొరేట్ మాఫియా!
- ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భద్రాద్రి జిల్లా కమిటీ డిమాండ్

కొత్తగూడెం ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

అక్షరాన్ని జ్ఞాన ఆయుధంగా మార్చి సమాజాన్ని ఉద్ధరించాల్సింది పోయి, విద్యను విచ్చలవిడి వ్యాపారంగా మారుస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భద్రాద్రి జిల్లా కమిటీ తీవ్రంగా ధ్వజమెత్తింది. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నేతలు మాట్లాడుతూ.. నేడు విద్య అనేది పేదవాడికి అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఫీజుల దోపిడీ.. అప్పుల ఊబిలో సామాన్యుడు:**

కేవలం లాభార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు విలవిలలాడుతున్నాయి. "ఒక బిడ్డను చదివించాలంటే ఆస్తి అమ్ముకోవాలా?" అన్న స్థాయికి ఫీజుల భారం పెరిగిపోయిందని, తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపోయి బతుకులు ఆగం చేసుకుంటున్నారని కమిటీ నేతలు పేర్కొన్నారు. ఏసీలు, బిల్డింగ్‌ల పేరిట రంగుల లోకాన్ని చూపిస్తూ, నిబంధనలను తుంగలో తొక్కి సామాన్యుల రక్తాన్ని పిలుస్తున్న కార్పొరేట్ విద్యా మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**ప్రభుత్వ పాఠశాలలే రక్షణ కవచం:**

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మేల్కొనాలని, నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ స్కూళ్లను తక్షణమే మూసివేయాలని వారు కోరారు. కేవలం ప్రైవేట్ సంస్థల మీద నిఘా పెట్టడమే కాకుండా, సర్కారు బడులను యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారానే సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపడం సాధ్యమవుతుందని హితవు పలికారు.

**ప్రభుత్వానికి అల్టిమేటం:**

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని, విద్యను వ్యాపార వస్తువుగా మార్చిన శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ డిమాండ్ చేస్తోంది. లేనిపక్షంలో సామాన్య ప్రజలను ఏకం చేసి జిల్లా వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని పార్టీ భద్రాద్రి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపాలిటీకి మంత్రి పొంగులేటి: అభివృద్ధి పనులకు శ్రీకారం!

- వార్డు కౌన్సిలర్లతో అత్యవసర భేటీ.. ఎమ్మెల్యే కనకయ్య ఆధ్వర్యంలో పట్టణ ప్రగతిపై సమీక్ష

ఇల్లందు ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

ఇల్లందు పట్టణ మున్సిపల్ పాలనలో సరికొత్త అధ్యాయానికి రేపు తెరలేవనుంది. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (ఏప్రిల్ 22) ఇల్లందు మున్సిపల్ కార్యాలయానికి విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ అధ్యక్షతన నిర్వహించనున్న వార్డు కౌన్సిలర్ల అత్యవసర సమావేశంలో పట్టణంలోని కీలక సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. అదేవిధంగా, మున్సిపల్ చైర్‌పర్సన్ నూతన చాంబర్‌ను కూడా మంత్రి ప్రారంభించనున్నారు.

పాలన అనేది కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, సామాన్యుడి గడప వరకు చేరాలన్నదే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరుతున్నారు.



# వసతి గృహాల్లో 'కలెక్టర్' తనిఖీ: విద్యార్థుల గోస తీరేనా?

టేకులపల్లి ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)


ప్రభుత్వ గురుకులాల్లో వసతుల లేమిపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం క్షేత్రస్థాయిలో మెరుపు తనిఖీలు చేపట్టారు. మండలంలోని గోలియాతండా మహాత్మా జ్యోతిబాపూలే గురుకులం, బద్దుతండా ఏకలవ్య హాస్టళ్లను సందర్శించిన ఆయన, విద్యార్థుల గదుల నుంచి వంటశాలల వరకు ప్రతి అంగుళాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కేవలం పైపైన తనిఖీలతో సరిపెట్టకుండా, విద్యార్థులతో స్వయంగా ముచ్చటించి భోజన నాణ్యత, మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. "కాగితాల్లో మెనూ కాదు.. కంచంలో నాణ్యత కనిపించాలి" అని హెచ్చరిస్తూ, విద్యార్థుల ఆరోగ్యం, మౌలిక వసతుల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ పర్యటనతోనైనా గురుకులాల్లో మౌలిక వసతులు మెరుగుపడి, పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ఉంటుందని ఆశిద్దాం.



# భద్రాద్రిలో లోక కళ్యాణం.. నిత్యం రామనామ స్మరణం!

భద్రాచలం ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి క్షేత్రంలో సీతారామచంద్రస్వామి వారి నిత్య కళ్యాణ వేడుక సోమవారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా సాగింది. వేకువజామునే మూలవరులకు సుప్రభాత సేవ, విశేష అర్చనలు నిర్వహించిన అనంతరం, వేద మంత్రోచ్ఛారణల మధ్య బేడా మండపంలో ఆది దంపతుల పరిణయ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. లోక కళ్యాణార్థం జరిగే ఈ వేడుకను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి, రామనామ స్మరణతో ప్రాంగణాన్ని పునీతం చేశారు. అయితే, ఆలయాల్లో జరిగే ఈ నిత్య కళ్యాణాల సందడి కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, సమాజంలో కూడా మనుషుల మధ్య బంధాలు, అనురాగాలు ఆ రామచంద్రుడి ఆశయాల వలె సుస్థిరంగా ఉండాలనే సందేశాన్ని భక్తులు తమ గుండెల్లో నింపుకుని వెళ్లడం విశేషం. వందల ఏళు ్లగా సాగుతున్న ఈ సంప్రదాయం భక్తికి మార్గమే కాదు, ధర్మ రక్షణకు ఒక నిలువుటద్దం.



# నిప్పుతో చెలగాటం వద్దు: 'అవగాహన'తోనే ఆస్తి, ప్రాణ రక్షణ!

ఇల్లందు ఏప్రిల్ 20 ( జన సంఘర్షణ)

వేసవి కాలం సెగలు పుట్టిస్తున్న వేళ, ఏమరపాటుగా ఉంటే అగ్నిప్రమాదాలు కొంప ముంచుతాయని ఇల్లందు ఫైర్ ఆఫీసర్ నవీన్ హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం వారం రోజుల ప్రచారంతోనే బాధ్యత ముగిసిపోదని, ప్రతి ఇంట్లోనూ అగ్ని భద్రత ఒక అలవాటుగా మారాలని పిలుపునిచ్చారు. గ్యాస్ సిలిండర్ల వినియోగం నుంచి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ల వరకు ప్రతి విషయంలోనూ అప్రమత్తత అవసరమని, ప్రమాదం సంభవించినప్పుడు కంగారు పడకుండా తీసుకోవాల్సిన ప్రాథమిక జాగ్రత్తలపై సిబ్బందికి, ప్రజలకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. "నిప్పు ముట్టుకుంటేనే కాలుతుంది అనుకోవడం భ్రమ.. మన నిర్లక్ష్యం నిప్పు కంటే వేగంగా ప్రాణాలను బూడిద చేస్తుంది" అనే కఠిన వాస్తవాన్ని గుర్తెరిగి, ప్రతి పౌరుడు అగ్నిమాపక నిబంధనలు పాటించినప్పుడే ఈ వారోత్సవాలకు నిజమైన సార్థకత చేకూరుతుంది. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొని ప్రజలకు రక్షణ కవచంలా నిలుస్తామని భరోసా ఇచ్చారు.




# మైదానాలే గెలుపు పునాదులు: క్రీడా శిక్షణకు 'గురువులు' సిద్ధమేనా?

కొత్తగూడెం ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

స్మార్ట్‌ఫోన్ల యుగంలో బాల్యం నాలుగు గోడలకే పరిమితమవుతున్న తరుణంలో, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యానికి పదును పెట్టేందుకు భద్రాద్రి జిల్లా యంత్రాంగం వేసవి క్రీడా శిబిరాలకు శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాల్లో 14 ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామ రెడ్డి దరఖాస్తులు ఆహ్వానించారు. కేవలం ఆటలు ఆడించడం మాత్రమే కాదు, క్రమశిక్షణతో కూడిన పట్టుదలను నేర్పే జాతీయ స్థాయి అనుభవం గల సీనియర్లు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆసక్తి గల వారు ఈనెల 23లోపు కలెక్టరేట్‌లోని +19 బ్లాక్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, గెలుపు ఓటముల కంటే క్రీడలు ఇచ్చే మానసిక ధైర్యం గొప్పదని గుర్తించి, ఈ వేసవిలో ప్రతి బిడ్డను మైదానం వైపు నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందని మనం మరువకూడదు. క్రీడా మైదానాలు కళకళలాడినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.



# ఇల్లందులో 'నయన' యజ్ఞం

- ఉచిత కంటి శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య!

ఇల్లందు ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

నిరంతరం ప్రజా సేవలో నిమగ్నమయ్యే ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్రతో కలిసి ఇందిరా నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆధునిక జీవనశైలిలో మనిషి శరీరానికే కాక, అత్యంత సున్నితమైన నేత్రాలకు కూడా ముప్పు పొంచి ఉందని, అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. "కళ్ళు లేనిదే లోకం చీకటి.. చూపు బాగుంటేనే జీవితం ప్రకాశవంతం" అని వ్యాఖ్యానిస్తూ, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అందిస్తున్న ఈ ఉచిత వైద్య సేవలు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, పేదరికం కారణంగా చికిత్సకు దూరమవుతున్న అట్టడుగు వర్గాల పట్ల బాధ్యతాయుతమైన ముందడుగు అని వారు స్పష్టం చేశారు. కేవలం వైద్యం కోసమే కాకుండా, ముందస్తు జాగ్రత్తల కోసం కూడా ప్రజలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, ఆరోగ్యవంతమైన ఇల్లందు నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారు కోరారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
మంగళవారం 21 ఏప్రిల్ 2026

# జె.కె.యం సోలార్' కార్యాలయాన్ని ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్

❑ **విద్యుత్ స్వయం సమృద్ధి దిశగా ఖమ్మం అడుగులు..**

ఖమ్మం ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

సామాన్యుడిపై నెలనెలా భారంగా మారుతున్న విద్యుత్ బిల్లుల కష్టాలకు తెరదించేందుకు, పర్యావరణ హితమైన ఇంధన వనరుల వినియోగమే ఏకైక మార్గమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని టీవీఎస్ షోరూం ఎదురుగా ఉన్న భవనంలో 'జె.కె.యం సోలార్ ఎనర్జీ' నూతన కార్యాలయాన్ని ఆయన రిబ్బన్ కత్తిరించి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంతో పాటు మనం ఇంధన వనరులను వాడుకునే పద్ధతి కూడా మారాలని ఉద్ఘాటించారు. "సౌర విద్యుత్ అనేది కేవలం ఒక సౌకర్యం కాదు, అది రాబోయే తరాలకు మనం అందించే స్వచ్ఛమైన పర్యావరణం.




ఒకప్పుడు సోలార్ అంటే ఖరీదైన వ్యవహారం అనే భావన ఉండేది, కానీ ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న భారీ సబ్సిడీల వల్ల ఇది ప్రతి ఇంటికి చేరువయ్యింది," అని ఆయన అన్నారు. ముఖ్యంగా పీఎం సూర్యఘర్ పథకం ద్వారా లభించే రూ.78,000 సబ్సిడీని ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**లాభదాయకమైన 'సౌర' పెట్టుబడి:**

జె.కె.యం సోలార్ ఎనర్జీ అధినేత మెర్సీ ఏంజెల్ జె.కె. మహేష్ ఈ సందర్భంగా సోలార్ యూనిట్ల పనితీరును వివరిస్తూ కీలక అంశాలను వెల్లడించారు.

ఆదాయ వనరు: ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల నెలకు 360 నుండి 750 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మన అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వ గ్రిడ్‌కు అమ్మి ఆదాయం పొందవచ్చు.

సున్నా పెట్టుబడి: వినియోగదారులపై భారం పడకుండా '0 డౌన్ పేమెంట్', '0 సర్వీస్ ఛార్జ్' తో ఈజీ ఈఎంఐ పద్ధతిలో ఇన్స్టాలేషన్ చేస్తామని ఆయన ప్రకటించారు.

భరోసా: ఈ యూనిట్లకు 25 ఏళ్ల వారంటీ మరియు 5 ఏళ్ల పాటు ఉచిత సర్వీసును సంస్థ అందిస్తోంది.



మొదటి 100 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అదనంగా రూ.10,000 డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించడం విశేషం. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ బోర్లకు, పరిశ్రమలకు, సోలార్ ఫెన్సింగ్ లైట్లకు కూడా తమ సంస్థ సేవలు అందిస్తుందని మహేష్ తెలిపారు. ప్రతి నెల విద్యుత్ బిల్లుల రూపంలో వేల రూపాయలు ఖర్చు చేయడం కంటే, ఆ మొత్తాన్ని ఈఎంఐగా మలచుకుని సొంతంగా విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారడం నేటి అవసరం. కాలుష్యాన్ని తగ్గించి గ్రీన్ పవర్ సాధించే ఈ ప్రయాణంలో ఖమ్మం వాసులు భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైందని ఈ ప్రారంభోత్సవం స్పష్టం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యర్లగడ్డ హనుమంతరావు, కార్పరేటర్ రాపర్తి శరత్, ఇతర ప్రముఖులు అశ్రఫ్, విగ్నేష్, యుగంధర్, బద్రుల్ల, నరాల నరేష్, మూర్తి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# సర్పంచ్ ఫోరంల మండల అధ్యక్షురాలిగా ప్రియాంక గణేష్



ఎల్లారెడ్డి, ఏప్రిల్ - 20(జన సంఘర్షణ )



ఎల్లారెడ్డి మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షురాలిగా సోమిర్యాగాడి తాండ సర్పంచ్ మాలోత్ ప్రియాంక గణేష్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా పల్లె నాగరాజు, మంజుల సాయిలు, లక్ష్మీ మైసయ్య, ప్రధాన కార్యదర్శిగా కొయ్యల వినోదరాజా గౌడ్, కార్యదర్శిగా గాది అంజయ్య, కోశాధికారిగా మంగలి సంతోష్, సలహాదారులుగా పులిగల దత్తు, చూడ నవ్య, కార్యవర్గ సభ్యులుగా కుమ్మరి మానస పందరి, సాయిలు శ్రీనివాస్ గౌడ్, పుట్ల చందు, బొండ్ల మైసయ్య, రతన్ నాయక్ ఏకుగ్రీంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షురాలిగా ప్రియాంక గణేష్ నాయక్ మాట్లాడుతూ.. సర్పంచ్ లంత ఐక్యతతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి గ్రామ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్రావు ఆధ్వర్యంలో గ్రామ సంక్షేమమే తన ప్రధాన లక్ష్యణ్ స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో బాధిత అప్పగించిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ అదేవిధంగా వివిధ గ్రామాల సర్పంచ్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారికి ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కురుమ సాయిబాబా శాలులతో సన్మానించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

# నాట్య కలలకు 'వేసవి' వేదిక..

❑ **కౌన్సిలర్లు నీలపు రమేష్, కొర్లపాటి కిరణ్ చేతుల మీదుగా 'వెంకట్ డాన్స్ అకాడమీ' సమ్మర్ క్యాంప్ షురూ!**

ఇల్లందు ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)




పుస్తకాల మోత నుంచి చిన్నారులకు విముక్తిని ప్రసాదిస్తూ, వారిలోని సృజనాత్మకతకు పదును పెట్టేందుకు వెంకట్ డాన్స్ అకాడమీ వేదికై నిలిచింది. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంప్) ప్రారంభోత్సవానికి 21వ వార్డు కౌన్సిలర్ నీలపు రమేష్, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

**సెల్ ఫోన్లకు దూరం - కళలకు దగ్గర: నీలపు రమేష్**

ఈ సందర్భంగా కౌన్సిలర్ నీలపు రమేష్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సెలవుల దొరికితే చాలు పిల్లలు స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలకే పరిమితమై శారీరక శ్రమను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో నృత్యం వంటి లలిత కళలపై మమకారం పెంచుకోవడం వల్ల వారిలో మానసిక వికాసం కలుగుతుందని, క్రమశిక్షణ




పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పట్టణంలోని చిన్నారుల ప్రతిభను గుర్తించి, వారికి సరైన వేదికను అందిస్తున్న వెంకట్ డాన్స్ అకాడమీ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**ఆత్మవిశ్వాసానికి నాట్యం మందు: కొర్లపాటి కిరణ్**

మరో అతిథి కొర్లపాటి కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఎదుగుదలలో కేవలం చదువే కాకుండా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. డాన్స్ అనేది ఒక అద్భుతమైన వ్యాయామం అని, ఇది శరీర దృఢత్వంతో పాటు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధులుగా తాము ఎల్లప్పుడూ వెన్నుముకగా ఉంటామని, ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు పట్టణంలో జరగాలని ఆయన ఆకాంక్షించారు.

**సందడిగా అకాడమీ ప్రాంగణం:**

వేసవి శిబిరం ప్రారంభం కావడంతో అకాడమీ ప్రాంగణం చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. తమ పిల్లల్లోని కళాభిరుచిని ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ వేసవి కాలంలో విద్యార్థులకు వివిధ రకాల నృత్య రీతుల్లో శిక్షణ ఇస్తామని, శిబిరం ముగిసే నాటికి వారిలో నైపుణ్యాన్ని వెలికితీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎత్తొండ గ్రామం యువతకు బిజెపి నాయకులు బాన్సువాడ ఇంచార్జ్ ఎన్నారై కోనేరు శశాంక్ క్రికెట్ కిట్లు పంపిణీ

కోటగిరి ఎత్తొండ/ ఏప్రిల్20/ (జన సంఘర్షణ)






సోమవారం బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండలం ఎత్తొండ గ్రామం యువతకు బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ క్రికెట్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, గుంజరి జగదీష్, శ్యామ్, గ్రామ బిజెపి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# నిరాడంబరంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

కుప్పం,ఏప్రిల్ 20 (జన సంఘర్షణ):



జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన జన్మదిన వేడుకలను సోమవారం నిరాడంబరంగా నిర్వహించుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన 76వ జన్మదిన వేడుకలను అత్యంత నిరాడంబరంగా కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. తన విజయాల్లోనూ, కష్టాల్లోనూ చేదోడు వాదోడుగా నిలిచిన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఆయన కేక్ కట్ చేసి ఈ మధుర క్షణాలను పంచుకున్నారు. ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన చంద్రబాబు, ఈ పుట్టినరోజున కూడా రాష్ట్ర ప్రగతిపై తన సంకల్పాన్ని చాటుకున్నారు. ఆప్యాయత, అనురాగాల మధ్య జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫోటో ఇది. ఇందులో సీఎం దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు, పార్టీ శ్రేణులు మురిసిపోతూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# వార్డు మెంబర్ బీజేపీ బూత్ అధ్యక్షుడు మల్లెపూల నాగరాజు తండ్రి మల్లెపూల విఠల్ మృతి..

❑ **వారి కుటుంబానికి బాన్సువాడ ఇంచార్జ్ బిజెపి నాయకులు ఎన్నారై శశాంక్ ఆర్థిక సాయం అందజేత**

కోటగిరి కొత్తపల్లి /ఏప్రిల్20 /(జన సంఘర్షణ)



సోమవారం కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో వార్డు మెంబర్ బీజేపీ బూత్ అధ్యక్షుడు మల్లెపూల నాగరాజు తండ్రి మల్లెపూల విఠల్ (68 ) అకాల మరణం చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ వెళ్ళి పరామర్శించి అంత్యక్రియల కోసం 5000 ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ అధ్యక్షులు ఆలపాటి హరి కృష్ణ, జనరల్ సెక్రటరీ సాయి కుమార్ గౌడ్, విష్ణు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

❑ **చలివేంద్రం ప్రారంభిస్తున్న కోనేరు శశాంక్**

కోటగిరి /ఏప్రిల్20/(జన సంఘర్షణ)



నిజామాబాద్ కోటగిరి మండల కేంద్రంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం వేసవి కాలంలో బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా చలివేంద్రం ప్రారం భించారు. కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎన్నారై కోనేరు శశాంక్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని, ప్రతి సంవత్సరం గత 15 సంవత్సరముల నుండి నిర్విరామంగా స్వచ్ఛందంగా సేవలందించడం అభినందనీయమని శశాంక్ పేర్కొన్నారు. మల్లారెడ్డి శ్వేత శ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమార్తె చిరంజీవి చందన హైదరాబాద్, వివేకానంద పాఠశాల కోటగిరి వారి సౌజన్యంతో మజ్జిగ, చల్లటి మంచినీరు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు శివ శ్రీనివాస్ తెలిపారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసం బాబు నిండు నూరేళ్లు జీవించాలి...ఎస్ సి వి నాయుడు

శ్రీకాళహస్తి ఏప్రిల్ 20 (జన సంఘర్షణ):

శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్ సి వి నాయుడు స్వగృహం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి మాజీ శాసనసభ్యులు ఎస్ సి వి నాయుడు సారథ్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, జన్మదిన కేకును ఎస్ సి వి నాయుడు కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, టిడిపి జిందాబాద్, మంత్రి నారా లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఎస్ సి వి నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోనే విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఏపీని అక్షర క్రమంలోనే కాకుండా అభివృద్ధి పదంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతర చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

# క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం

◆ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి



పలమనేరు, ఏప్రిల్ 20 (జన సంఘర్షణ) : తెలుగుదేశం పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమిస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అన్నారు. పలమనేరులో జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో భాగంగా, పార్టీ కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన యూనిట్ ఇంచార్జి సురేష్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సురేష్ తన యూనిట్ పరిధిలో పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం సురేష్‌కు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పంపిన ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ, పార్టీ బలోపేతంలోనూ ప్రతి ఒక్కరూ సురేష్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కుట్టి, గిరి, డిష్ రమేష్, సుధాకర్, విజయ్ శేఖర్, కృష్ణ, నరేష్, చెన్నారాయప్ప పాల్గొన్నారు.

# ఢిల్లీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ త్రిసభ్య బృందం..

◆ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరంతో సమావేశమైంది.
◆ పార్టీ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావు

తెలంగాణ సిద్ధిపేట ఢిల్లీ/ఏప్రిల్20/(జన సంఘర్షణ)



ఢిల్లీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ త్రిసభ్య బృందం.. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరంతో సమావేశమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీ వెళ్లిన మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు ఆయనను కలిశారు. ముఖ్యంగా కాళేశ్వరం కమిషన్‌పై త్వరలో రానున్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలతో పాటు, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై సీనియర్ లాయర్ ఆర్యమా సుందరంతో సుదీర్ఘంగా చర్చించారు.

# పిల్లలకు ఒత్తిడి లేని విద్యనందించాలి

◆ ప్రైవేట్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సతీమణి రేణుకా రెడ్డి



పలమనేరు, ఏప్రిల్ 20 (జన సంఘర్షణ) : ప్రస్తుత విద్యా విధానంలో పిల్లలపై తీవ్రమైన ఒత్తిడి ఉందని, దీనివల్ల పిల్లలు డిప్రెషన్‌కు లోనవుతున్నారని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి పేర్కొన్నారు. గంగవరం మండలంలో ప్రీ ఆన్ ఫ్యూచర్ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి సోమవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పూజలు నిర్వహించిన అనంతరం పాఠశాలను ప్రారంభించారు. వినూత్నమైన ప్లే-బేస్డ్ ఎర్లీ ఎడ్యుకేషన్ స్కూల్‌ను ప్రారంభించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఆటల ద్వారా సాగే ఈ విద్యా విధానం పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, శారీరక, మానసిక ఎదుగుదల, సోషల్ స్కిల్స్, సృజనాత్మకతను పెంపొందించడానికి సహాయపడుతుందని ఆమె వివరించారు. ఈ విధానం వల్ల పిల్లలు ఆత్మవిశ్వాసంతో పెరుగుతారని, భవిష్యత్తులో వారికి ఎటువంటి అలవాట్లు (అడిక్షన్స్) లేకుండా మంచి పౌరులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన విద్యా విధానాన్ని అర్థం చేసుకుని, తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఆమె కోరారు. అనంతరం పాఠశాల నిర్వాహకురాలు మౌనికకు, ఆమె బృందానికి అభినందనలు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, గంగవరం, బైరెడ్డి పల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివ-సందీప్ చొరవతో "రీచ్ అవుట్ లైఫ్ సెంటర్" సేవ...

◆ చిన్నాకట్టుగూడెంలో బోర్ వేయించి నీటి కష్టాలకు చెక్
◆ సర్పంచ్ కృష్ణవేణి సమన్వయం... గ్రామానికి తాగునీటి శాశ్వత పరిష్కారం

సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ) గుంపెళ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నాకట్టుగూడెం గ్రామంలో నెలలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గౌరవ సర్పంచ్ గుగులోత్ కృష్ణవేణి – వీరబాబు సమయోచితంగా స్పందించి, "రీచ్ అవుట్ లైఫ్ సెంటర్" స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామంలో బోర్ వేయించడం ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సర్పంచ్ చొరవతో చేపట్టిన ఈ చర్య గ్రామ ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగించింది. ఈ కార్యక్రమం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంతోష్ నాయక్, ఉపసర్పంచ్ శంకర్, వార్డ్ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు రాములు, లక్ష్మణ్, భద్రు తదితరులు తమ సహకారం అందించారు. ఇదిలా ఉండగా, నల్లగొండకు చెందిన "రీచ్ అవుట్ లైఫ్ సెంటర్" సంస్థ ప్రతినిధి సందీప్, గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన హైదరాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గుగులోత్ శివ సహకారంతో పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు వైద్య శిబిరాలు నిర్వహించడం, గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్న చోట సహాయం అందించడం వంటి కార్యక్రమాలతో ఈ సంస్థ మంచి పేరు సంపాదించుకుంది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడిన అందరికీ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.








# సీఎం చంద్రబాబుకు టీటీడీ ఆశీర్వచనాలు

◆ సీఎంకు శ్రీవారి ప్రసాదాలు అందజేసిన టీటీడీ.
◆ దుర్గగుడి అర్చకులచే ఆశీర్వచనాలు.



కుప్పం,ఏప్రిల్ 20 (జన సంఘర్షణ): జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు టీటీడీ, దుర్గ గుడి అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని టీటీడీ, దుర్గగుడి అర్చకుల ఆశీర్వచనాలు అందజేశారు. పుట్టిన రోజు సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు ఆశీర్వచనం అందించిన టీటీడీ, దుర్గగుడి పండితులు. ముఖ్యమంత్రికి వేంకటేశ్వరస్వామి, దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ప్రసాదం, చిత్రపటాలను టీటీడీ అడిషనల్ ఈవో వెంకన్న చౌదరి, దుర్గగుడి ఈఓ శీనా నాయక్ లు అందజేశారు.

# అన్నా క్యాంటీన్లో ఉచితంగా అన్నదానం

◆ కుప్పం గుడిపల్లె అన్న క్యాంటీన్లో పెద్ద ఎత్తున అన్నదానం.






కుప్పం,ఏప్రిల్ 20 (జన సంఘర్షణ): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా కుప్పం,గుడిపల్లి, శాంతిపురం మండలాలలోని అన్న క్యాంటీన్ ల ద్వారా పేదలకు సోమవారం ఉచితంగా మూడు పూటలా ఆహారం అందజేశారు. కుప్పం లోని అన్నా క్యాంటీన్లో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు పాల్గొని అందరికీ ఆహారం అందజేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. గుడిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆ మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. గుడిపల్లి అన్న క్యాంటీన్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. శాంతిపురం అన్న క్యాంటీన్లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# అక్రమ నీటి చోరీలో.. మున్సిపల్ అధికారులకు వాటెంత?

◆ కరెంట్ బిల్లులు ఎవరు చెల్లించాలి?
◆ నీటి చోరీకి పాల్పడుతున్న నర్సిగొండ లక్షలు గడుస్తున్నాడు
◆ కళ్ళు మూసుకున్న మున్సిపల్ కమిషనర్

తెలంగాణ కామారెడ్డిబాన్సువాడ/ఏప్రిల్20/(జన సంఘర్షణ) కామారెడ్డి జిల్లా బాన్సువాడ సంగమేశ్వర్ కాలనీలోని నాలుగో వార్డ్‌లో ప్రభుత్వ బోరు నుంచి నర్సిగొండ అనే కాంట్రాక్టర్ సంవత్సరము నుంచి నీటి చోరికి పాల్పడుతూ లక్షలు గడుస్తున్నారు.. దీంట్లో మున్సిపల్ అధికారులకు వాట ఎంత? అన్న ప్రశ్న తలెత్తుతుంది.0 ఏడాది నుంచి అక్రమంగా రెండు ట్యాంకర్ ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రికి, వెంచర్లకు దర్జాగా నీటిని సరఫరా చేస్తూ లక్షలు గడుస్తున్నారు. కానీ దీనిని అరికట్టవలసిన మున్సిపల్ అధికారులకు మాత్రం ఎన్ని అందుతున్నాయో గాని వారు మాత్రం ఈ నీటి చోరీని అరికట్టలేకపోతున్నారు. దర్జాగా ఉదయం నుంచి రాత్రి వరకు ఈ బోరు నుంచి ప్రవేటు పనులకు నీటిని తరలిస్తూ పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. అధికారం మాది ఉంది మమ్మల్ని ఎవరేం చేస్తారు? అన్న ధీమతో నర్సిగొండ గత కొన్ని నెలల నుంచి ఈ ప్రభుత్వ బోర్డు నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా తరలిస్తూ ఒక మాఫియాగా ఎదుగుతున్నారు. ప్రజలకు దాహం తీర్చే బోర్ల నుంచి ఇతరులకు అక్రమంగా నీటి చోరీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, మున్సిపల్ కమిషనర్ విషయంలో ఎందుకు స్పందించటం లేదో అర్థం కావడం లేదు. ఆయనకు ఎంత వాటా వస్తుంది? అన్నది ఆరోపణ వినిపిస్తుంది.

ప్రభుత్వ బోరు మోటర్ నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు ట్యాంకర్ ద్వారా నీటిని వెంచర్లకు తరలిస్తూ లక్షల గడుస్తున్నారు. మరి మున్సిపాలిటీకి దీంట్లో వాట ఎంత ఉందో తెలియాల్సి ఉంది. సంవత్సరం కాలంగా ఈ బోరు నుంచి అక్రమంగా నీటి చోరీకి పాల్పడుతూ లక్షల గడుస్తుంటే, ఒకవైపు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మరొకవైపు ఆగ్రో పరిశ్రమల చైర్మన్ కాసుల బాలరాజ్ ఎందుకు మౌనం ఉంటున్నారు అర్థం కావడం లేదు. మున్సిపల్ కమిషనర్ తో పాటు సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజల దాహం తీర్చే మంచినీటి బోర్ల నుంచి నీటి చోరికి పాల్పడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉచితంగా మంచినీరును ట్యాంకర్ల ద్వారా వెంచర్లకు, నూతన భవనాల నిర్మాణాలకు సరఫరా చేస్తూ పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారు. కానీ మున్సిపల్ కమిషనర్ తో పాటు, సిబ్బంది నీటి చోరికి పాల్పడుతున్న వ్యక్తికే అండగా నిలవడం అర్థం కాని విషయం. లక్షల బిల్లులు మున్సిపల్ అధికారులు చెల్లిస్తే, ఉచితంగా బోర్ నుంచి మంచి నీటిని మునిసిపల్ అధికారుల అనుమతులు లేకుండా, రెండు ట్యాంకర్లను పెట్టి ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం అంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నీటి చోరీకి పాల్పడుతున్న వ్యక్తుల నుంచి కరెంటు బిల్లులు ఎందుకు వసూలు చేయడం లేదు. వారి టాంకర్లను సీజ్ ఎందుకు చేయడం లేదు మున్సిపల్ అధికారులు అంటే వీరికి నెలనెలా మామూలు అందుతున్నాయని ఆరోపణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజల అవసరాల కోసం వేసిన మంచినీటి బోర్డు నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు ట్యాంకర్ ద్వారా నీటి చోరీకి పాల్పడుతుంటే పాలకులు, సంబంధిత అధికారులు ఎందుకు స్పందించటం లేదన్నది ఒక ప్రశ్నార్థకంగా మిగిలింది. నర్సిగొండ అధికార పార్టీకి చెందిన ఓచోట నాయకుడు ఆయన పని రెండు ట్యాంకర్ల ద్వారా సంగమేశ్వర్ కాలనీలోని నాలుగో వార్డ్ లో ప్రజల దాహం తీర్చుడానికి వేసిన బోర్డు నుంచి ప్రతిరోజు టాంకర్ ద్వారా నీటి చోరీకి పాల్పడుతున్నారు . ఇదంతా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కళ్ళముందే జరిగితే ఎందుకు దాన్ని నివారించడం లేదు. దీనివల్ల ప్రతిరోజు లక్షల లీటర్ల నీరు చోరీకి గురవుతుంది. వచ్చేది మే మాసం ఈ మాసంలో ఎండలు తీవ్రంగా ఉంటాయి, అంతే కాకుండా భూగర్భ జలాలన్నీ అడుగంటి పోతాయి. ఈ బోరు నీటిని ఎత్తివేస్తే ఆ కాలనీవాసుల పరిస్థితి ఏమిటి అని సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు ఆలోచించకపోవడం పట్టణ ప్రజలు చేసుకున్న పాపం అయింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శ్రీహరి






రాజును రాష్ట్ర ప్రతినిధి వివరణ కోరగా తక్షణం బోర్ మోటార్ కి సంబంధించిన ఫీజులు తొలగించి నీటి చోరీని అరికట్టమని ప్రకటించినప్పటికీ మళ్లీ యధావిదంగా నీటి చోరీ జరుగుతుంది. ఇప్పుడు ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ మీ సమాధానం ఏమిటి?

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
మంగళవారం
21 ఏప్రిల్ 2026

# కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పునరుద్ధరించాలని సంకల్పించిన నేపథ్యంలో కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ కాళేశ్వరం మేడిగడ్డ/ఏప్రిల్20/(జన సంఘర్షణ)

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పునరుద్ధరించాలని సంకల్పించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మేడిగడ్డ డ్యామ్ సైట్‌ను చేరుకున్న ముఖ్యమంత్రి పునరుద్ధరణ చేపట్టడానికి సంబంధించి జరుగుతున్న జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో పాటు ఇతర సంస్థల సూచనల ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించడానికి చేపట్టాల్సిన పనులపై జరుగుతున్న పరీక్షలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ లతో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.



బ్యారేజీ కుంగిన ప్రాంతంలో పరిస్థితులను నీటి పారుదల శాఖ అధికారులు సమగ్రంగా వివరించారు. పునరుద్ధరణకు నిర్వహిస్తున్న వివిధ పరీక్షల విధానాలను తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్స్ 20, 21, 22 వద్ద బోర్ రిగ్స్ ద్వారా జియోటెక్నికల్, జియోఫిజికల్, జీపీఆర్, శాంపిల్స్ సేకరణ పనులను పరిశీలించారు. పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో 520 బోర్ రిగ్స్ ద్వారా శాంపిల్స్ సేకరించి సెంట్రల్ వాటర్ అండ్ రీసెర్చ్ స్టేషన్ కు పంపనున్నారు. అక్కడ ల్యాబ్‌లో పరీక్షల అనంతరం దెబ్బతిన్న బ్యారేజీకి సంబంధించి పూర్తి అవగాహన రానుంది.

డ్రోన్ బేస్డ్ జీపీఆర్ టెస్ట్‌కు సంబంధించి అధికారులు ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి అధికారులు వివరించారు. ఈ పరీక్షల ద్వారా 20 నుంచి 30 మీటర్ల లోతు వరకు పియర్స్ వద్ద నేల స్వభావానికి సంబంధించి ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద సీలెంట్ పైల్స్‌కు సంబంధించి సమాంతర క్రాస్‌హోల్ సీస్మిక్ టెస్ట్ వివరాలను తెలిపారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు సంబంధించి బ్యారేజీ వద్ద సాగుతున్న వివిధ పరీక్షలను పరిశీలించిన అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోపాలను సరిచేసి పునరుద్ధరించడంలో ఎలా ముందుకెళ్లాలో ఒక స్పష్టత వచ్చిందని, పునరుద్ధరణలో భాగస్వామ్యమయ్యే సంస్థలు, అధికారులు, నిపుణులు సమస్యను అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్టేనని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరీక్షల ద్వారా సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత అధికారులు పనులు మొదలు పెట్టాలని చెప్పారు. సేకరించిన శాంపిల్స్ ద్వారా వచ్చే ఫలితాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకు వెళ్లాలని, ప్రతి విషయంలో వారి అనుమతి తీసుకుని ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ అధికారులతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ప్రతినిధులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత - యువత భవిష్యత్తు పోలీసుల బాధ్యత

- **పలమనేరులో ఘనంగా “సురక్షిత చిత్తూరు” అవగాహన సదస్సు**

పలమనేరు, ఏప్రిల్ 20 (జన సంఘర్షణ) :

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు, పలమనేరు సబ్-డివిజన్ డీఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం పలమనేరు మండలంలో “సురక్షిత చిత్తూరు (మీ భద్రత మా బాధ్యత)” అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. మహిళల రక్షణ, శక్తి యాప్ వినియోగం, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన ఈ సదస్సులో సుమారు 300 మంది అంగన్వాడీ కార్యకర్తలు, సంఘమిత్రాలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేధింపులు ఎదురైనప్పుడు మహిళలు భయపడకుండా ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న శక్తి టీమ్స్, డయల్ 112 వంటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు మహిళలకు అండగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. డ్రగ్స్ , గంజాయి వినియోగం యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తుందని డీఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ప్రతికూల ప్రభావాలను వివరిస్తూ, యువత వీటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. పలమనేరు ఎస్సై స్వర్ణ తేజ మాట్లాడుతూ... గ్రామాల్లో మత్తు పదార్థాల సరఫరా లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సోషల్ మీడియా ప్రభావం, చెడు స్నేహాల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ మహిళలకు ఎలా రక్షణ కల్పిస్తుందో ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు సిడిపిఓ ఉమామహేశ్వరి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ చందు రాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్న సీఎం చంద్రబాబు

- **ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్.**
- **కుప్పంలో పెద్ద ఎత్తున చంద్రబాబు జన్మదిన వేడుకలు.**
- **అన్నా క్యాంటీన్లలో పేదలకు అన్నదానం.**
- **మహిళలచే చంద్రబాబు చిత్రపటానికి కృష్ణమ్మ జలాలతో అభిషేకం.**
- **భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ.**
- **పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ.**
- **చంద్రబాబు జిందాబాద్, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించిన మహిళలు.**

కుప్పం,ఏప్రిల్ 20 (జన సంఘర్షణ):

రాయలసీమలో చిట్ట చివరన ఉన్న కుప్పం నియోజకవర్గం నేలపై కృష్ణమ్మ జలాలను పరవళ్ళు పారించిన మహా నేత చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం పార్టీ నేతలు కొనియాడారు. జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కుప్పం శాసనసభ్యులు, కుప్పం ప్రజల ఆశాజ్యోతి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినాన్ని కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో ప్రజలు ఎవరికి వారు తమకు తోచిన విధంగా చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కుప్పం కు దాదాపు 1000 కిలోమీటర్ల దూరంలోని కృష్ణమ్మ జలాలను హంద్రీ నీవా కాలువ ద్వారా కుప్పం నేలపై పారించిన మహానేత చంద్రబాబు నాయుడు అని నేతలు కొనియాడారు. బాధ్యత కలిగిన నాయకుడు కనుకనే గత 40 సంవత్సరాలుగా చంద్రబాబును గుండెల్లో పెట్టుకొని గెలిపించుకుంటూ వస్తున్నామన్నారు. అన్నా క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చేందుకు మహోన్నతమైన చర్యలు తీసుకున్నారు అని చంద్రబాబును ప్రశంసించారు. కుప్పంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుప్పం నడిబొడ్డులోని రామాలయంలో చంద్రబాబు పేరు మీద, కుటుంబ సభ్యుల మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కుప్పం గుడిపల్లి రహదారిలోని శ్రీ సోమేశ్వర దేవాలయం వద్ద నుండి మహిళలు కృష్ణా జలాలతో నిండిన కలశాలను తలపై ధరించి ఊరేగింపుగా బస్టాండ్ వద్దకు చేరుకున్నారు అక్కడ చంద్రబాబు చిత్రపటానికి మహిళలు కృష్ణాజిల్లాలతో అభిషేకం నిర్వహించారు. టిడిపి నాయకులు భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం కుప్పం చెరువుకట్టు మీద నుంచి పట్టణ ప్రధాన రహదారి మీదుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం లు ప్రసంగించారు. అనంతరం కుప్పం 100 పడగల ప్రాంతీయ వైద్యశాలలో మహిళలకు ఏర్పాటు చేసిన క్యాన్సర్స్ శిబిరంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ ఊరేగింపులతో కుప్పంలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలోని తెలుగుదేశం నాయకులు ఎవరికి వారు తోచిన రీతిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కుప్పం పట్టణ ప్రధాన రహదారిలో తెలుగుదేశం యంత్రాంగం భారీ వాహన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా పట్టణంలో టపాకాయల మోత మారు మోగింది. చంద్రబాబు జిందాబాద్ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి టు మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కంచర్ల శ్రీకాంత్, మునిరత్నం, సురేష్ బాబు,ఎస్. రాజకుమార్, రాజగోపాల్, బిరుదునపల్లి సంతోష్, చెక్కు నత్తం మణి, వెంకటేష్, సుబ్రమణి, ఉదయ్ కుమార్ నాయుడు, కే కన్నన్, సోమశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు సెల్వ రాజు, కేఎం వేణుగోపాల్ షణ్ముగం, శ్రీనివాసులు, శ్యామ్, మంజునాథ్ జ్ఞుఖేష్ అప్పు, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, ఆర్.ఆర్. రవి, డాక్టర్ డి. సుధీర్, శ్రీధర్, దయాకర్, డాక్టర్ వి వెంకటేష్, సురేష్, ఎం ఆర్ సురేష్, ఆర్.సూర్య ప్రకాష్, డీకేపల్లి మణి, నబి, పీఎం బాబు నాయుడు, సుబ్రమణి, హేమంబర గౌడు, ఉదయ్ కుమార్, చంద్రశేఖర్, యశ్వంత్, వేణుగోపాల్ ,సెల్వరాజ్, పలువురు టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీ భవనం భూమి పూజ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

వర్ని/ఏప్రిల్20/(జన సంఘర్షణ)

గౌరవ ఉమ్మడి వర్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేయునది ఏమనగా 21వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు వకీల్ ఫారం గ్రామపంచాయతీ భవనము భూమి పూజ కార్యక్రమానికి మాజీ మంత్రి, మాజీ స్పీకర్, ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు విచ్చేయుచున్నారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావలసిందిగా కోరుచున్నాము.



# కన్నుల పండుగల బసవ జయంతి

చౌడేపల్లి ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

కుల మతాలకు అతీతంగా పోరాడిన యోధుడు మహిళలు అని రంగాలలో ముందుండాలని పోరాటాలు చేసిన ఉద్యమకారుడు 12వ శతాబ్దంలోనే లింగాయత్ ధర్మ సంస్థాపన చేసిన మహోన్నతుడు బసవ జయంతిని కన్నుల పండుగగా నిర్వహించారు స్థానిక మఠం రవి ఆధ్వర్యంలో ఉదయాన్నే ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ప్రారంభించారు. గణపతి పూజ శివ స్తోత్రాలతో సాంప్రదాయపద్ధంగా పూజాది కార్యక్రమాలు జరిగాయి నాటి సమాజంలో ఉన్న కులమతాలకు వ్యతిరేకంగా ఆయన పోరాడిన పోరాటాలు ఉద్యమాలను గుర్తు చేశారు. అనంతరం మహిళలు బసవన్నలకు పూజలు చేశారు. అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుంగనూరు నియోజకవర్గ వీరశైవ లింగాయత్ జంగం సేవా సంఘం అధ్యక్షుడు తానాధర్ నాగరాజా, ప్రముఖ వైద్యుడు శివకుమార్, బసవరాజా, సురేంద్ర, శివన్న రాజన్న, లోకేష్, డాక్టర్ అశోక్, మండలంలోని లింగాయత్ జంగమ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# చంద్రబాబును మించిన నాయకుడు ఎవరూ లేరు

సదుం ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీల నాయకులలో చంద్రబాబు నాయుడును మించిన నాయకుడు ఎవరూ లేరు అని మండల టీడీపీ నేతలు అన్నారు. సోమవారం సదుం బస్టాండ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కేక్ ని కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వము ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోనే రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆర్థికంగా చితికిపోయిన పరిస్థితిలో కూటమి ప్రభుత్వ రథసారథి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ అదేవిధంగా ప్రకటించనటువంటి కార్యక్రమాలను పూర్తి చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు చేరువయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్నాథ్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు రెడ్డి ప్రసాద్ రెడ్డి, కుమార్, మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, నారాయణ గౌడ్, వసంత్ కుమార్ క్రిష్ణయ్య, ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోలుకోవాలని ఆంజనేయ స్వామి పూజలు

సోమల, ఏప్రిల్ 20 (జన సంఘర్షణ):

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురై శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుతూ సోమల మండలంలో జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు భక్తి వాతావరణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమలలోని ప్రసిద్ధ సోమల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆంజనేయస్వామి ఆశీస్సులు కోరుతూ టెంకాయలు కొట్టి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ తన సినీ జీవితం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావడంతో పాటు, రాజకీయ రంగంలోనూ పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఉన్న సేవాభావం, నిబద్ధత వల్లే కోట్లాది ప్రజల హృదయాల్లో అభిమాన నటుడిగా మాత్రమే కాకుండా ప్రజానాయకుడిగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. అలాగే, ఇటీవల ఆయన అస్వస్థతకు గురవడం బాధాకరమని, కానీ పూర్తిస్థాయి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలంటే కొద్దికాలం విశ్రాంతి అవసరమని అభిప్రాయపడ్డారు. ఆంజనేయస్వామి కృపతో ఆయన త్వరగా కోలుకుని, మరింత ఉత్సాహంతో ప్రజల ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోమల జనసేన మండల కన్వీనర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు కోలా రామకృష్ణ, మురళి, సోము శేఖర్, షబ్బీర్, విజయ్ కుమార్, బాల, వినోద్, మణి రాయల్, చెంగల్ రాయులు, ప్రసాద్, లక్ష్మీ రెడ్డి, వెంకటేష్, ఉత్తన్న, ఈశ్వర్, నిరంజన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తేస్తాం

**తొలి సంతకం దానిపైనే పెడతాం**

**పంచాయతీలను నాశనం పట్టించారరు**

**మున్సిపాలిటీలను మురికి కూపం చేశారు**

**రిటైడర్డ్ ఉద్యోగులకు సొమ్ములు రావడం లేదు**

**జగిత్యాల సభలో కెసిఆర్ ఘాటు విమర్శలు**

**జగిత్యాల, ఏప్రిల్20 :**

గ్రామ పంచాయతీలను నాశనం పట్టించారని.. మున్సిపాలిటీలను మురికి కూపం పట్టించారని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మరి ఏం సక్కగుందని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి అని జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు అంటున్నారని తెలిపారు. వాళ్ల నోటి నుంచి వట్టిగానే ఆ మాట వస్తదా.. బాధ్యత లేకుండానే వస్తదా అని ప్రశ్నించారు. ఏం చూసినా సక్కగా లేకపోతే.. పొద్దున లేస్తే దోపిడి తప్ప ఇంకోటి లేకపోతే ఎందుకు ఈ పరిస్థితి వస్తుందని అడిగారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవరు సక్కగున్నరు అని కేసీఆర్ అడిగారు. సంతృప్తిగా ఎవరున్నారని అన్నారు. ఈ అందానికి బోడి ముండ హైడ్రాను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిడ్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసిడెంట్ ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. రేపు జగిత్యాలకు జిడ్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో మూడున్నర లక్షల మందికి ఎక్కడ ఉంటే అక్కడే పట్టాలిచ్చామని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ ఇవాళ ఏం కూలగొడుతున్నారని మండిపడ్డారు. పిల్లలను పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా.. అంత ఎగిర్తమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేది ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజుల్లోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని హామీ ఇచ్చారు. మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో
పడేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశామని.. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదని స్పష్టం చేశారు. మూసీ అని గరీబోళ్లను ఏడిపిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. పొద్దున లేస్తే నిద్రపోకుండా, వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 వేల ఇళ్లు కూలగొడతామని అంటున్నారని.. అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకని నిలదీశారు. భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదని అన్నారు. ఈజీగా చేయగలిగిన దాన్ని నాశనం పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఏది చూసినా కూడా ఒకరకమైన దోపిడీ, ఒకరకమైన గుండాగిరి, అరాచకంతో ముందుకెళు న్నారే తప్ప.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీమ్ కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పండబెట్టింద్రని.. ఏం రోగమని కేసీఆర్ ప్రశ్నించారు.

## పార్టీ ప్రధాన కార్యదర్శిగా జీవన్ రెడ్డి

**జగిత్యాల సభ వేదికగా కెసిఆర్ ప్రకటన**

**అన్నదమ్ముల్లా కలసి పనిచేస్తామని వెల్లడి**

**జగిత్యాల, ఏప్రిల్20** జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారంటేనే ఊపు వస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. జీవన్ రెడ్డి జగిత్యాల జిల్లా మాత్రమే కాదు.. పాత కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పరిసర జిల్లాల బాధ్యతలు చూడాలని కోరారు. జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ వేదికపై జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. జీవన్ రెడ్డిని పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నాని ప్రకటించారు. ఆరు నూరైనా.. నూటికి నూటి శాతం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా జీవన్ రెడ్డి అనేక పదవులు, సేవలు అందిస్తారని తెలిపారు. ఇది కేసీఆర్ మాట అని స్పష్టం చేశారు. 45 ఏండ్ల నుంచి మేం స్నేహితులం. భిన్న రాజకీయ సిద్ధాంతాల కారణంగా విడివిడిగా పనిచేశామని తెలిపారు. కానీ తమ స్నేహంలో లేదని పేర్కొన్నారు. బాధలు, సుఖాలు, అభిప్రాయలను పంచుకునేవాళ్లమని పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి ఉండే నిబద్ధత, ప్రజా జీవితంలో పనిచేసిన పద్ధతి ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఆయన ఒక్క జగిత్యాలలోనే కాదు.. పాత కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా, పొరుగున ఉన్న అనేక జిల్లాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నా.. మంత్రిగా ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. జగిత్యాల అభివృద్ధిని ఏమాత్రం విస్మరించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరీంనగర్‌లో సభ పెడితే అక్కడికి ప్రజాప్రతినిధిగా జీవన్ రెడ్డి వచ్చారని తెలిపారు. అప్పుడు బోర్నపల్లి దగ్గర గోదావరిపై బ్రిడ్జి కావాలని అడిగారని గుర్తుచేశారు. అక్కడి నుంచే ఆదేశాలిచ్చి, 70 కోట్లు మంజూరు చేసి బ్రిడ్జి కట్టించానని తెలిపారు. తన నియోజకవర్గం పట్ల జీవన్ రెడ్డికి ఉన్న ప్రేమ అద్భుతమని కొనియాడారు. అందుకే జీవన్ రెడ్డికి మంచి పేరు ఉందని అన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే ఎలా ఉంటుందని పలువురు సర్వేలు చేసి చెప్పారని కేసీఆర్ తెలిపారు. జగిత్యాలతో పాటు చొప్పదండి, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, ఇలా చాలా నియోజకవర్గాల్లో ప్రభావం ఉంటుందని ఆ సర్వేల్లో తేలిందని పేర్కొన్నారు. అది జీవన్ రెడ్డి విశిష్టత అని వివరించారు. జీవన్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని ఒక సమితి ప్రెసిడెంట్‌గా ప్రారంభించి, ప్రజా సమస్యలపై పోరాడారని తెలిపారు. నిఖార్సైన ప్రజా కార్యకర్తగా నిరూపించుకుని అంచెలంచెలుగా ఎదిగి, అనేక పదవులు చూశారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి పదవులు కొత్త కాదు.. ఎమ్మెల్యేగా గెలవడం, మంత్రి పదవి అలంకరించడం అనేక రంగాల్లో పనిచేశారని గుర్తుచేశారు. జీవన్ రెడ్డిని మొన్న కలిసినప్పుడు.. కుటుంబంలో అన్నదమ్ముల్లా కలిసి పనిచేద్దామని చెప్పానని తెలిపారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారంటేనే ఒక ఊపు వస్తుందని కేసీఆర్ తెలిపారు. జగిత్యాల జిల్లా మాత్రమే కాదు.. పాత కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పరిసర జిల్లాల బాధ్యతలు చూడాలని కోరారు.

## పరీక్షల వేళ కట్టుదిట్టమైన భద్రత

**సైబరాబాద్ సిపి రమేశ్ ఉత్తర్వులు**

**హైదరాబాద్, ఏప్రిల్20 :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబరాబాద్ సీపీ రమేశ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్, తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ పరీక్షల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతని పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో గుమిగూడటానికి నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా గూడటం నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర వందమీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉత్తర్వులు అమలు అవుతాయని వెల్లడించారు. పోలీస్, సైనిక సిబ్బంది, హోం గార్డులకు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు. విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ విధులకు అనుమతి ఉంటుందని, అలాగే అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ రమేశ్ స్పష్టం చేశారు.

# గులాబీ దళపతితో ఉద్యమ కెరటం రోషం బాలు భేటీ

**జగిత్యాలలో రాజకీయ ప్రకంపనలు!**



**జగిత్యాల ఏప్రిల్ 20 (జన సంఘర్షణ)** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరోసారి ఆసక్తికర మలుపు తిరిగింది. ఉద్యమ కాలం నాటి ఆత్మీయ అనుబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన తెలంగాణ ఫిలిం జేఏసీ ప్రెసిడెంట్, పొలిటికల్ జేఏసీ కమిటీ మెంబర్ రోషం బాలు, ఈరోజు జగిత్యాల వేదికగా బిఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు (ఖజ=) గారిని కలవడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం ఇదొక మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదని, రాబోయే రాజకీయ పరిణామాలకు ఇదొక బలమైన సంకేతమని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఉద్యమ కెరటం.. వెండితెర సాక్షిగా!**

రోషం బాలు అంటే కేవలం ఒక రాజకీయ నాయకుడో లేదా సినిమా ప్రొడ్యూసరో కాదు; ఆయన ఒక ఉద్యమ గళం. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జేఏసీ సభ్యుడిగా క్షేత్రస్థాయిలో పోరాడటమే కాకుండా, తన సినీ నిర్మాణ రంగం ద్వారా తెలంగాణ నేపథ్యం ఉన్న కథలను వెండితెరకు పరిచయం చేశారు. ఆనాడు ఆయన తీసిన సినిమాలు సామాన్యుడిలో సైతం స్వరాష్ట్ర కాంక్షను రగిల్చాయి. అటువంటి నిఖార్సైన ఉద్యమకారుడు, నేడు జగిత్యాల పార్టీ మీటింగ్‌కు ముందు కేసీఆర్ గారిని ప్రత్యేకంగా కలవడం, పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**రాబోయేది మన ప్రభుత్వమే: రోషం బాలు ధీమా**

ఈ భేటీ అనంతరం రోషం బాలు గారు మాట్లాడుతూ పలికిన మాటలు గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. "తెలంగాణ రాష్ట్ర పునాదులు ఉద్యమకారుల త్యాగాలపై నిర్మించబడ్డాయి. నేడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, మళ్లీ కేసీఆర్ గారి నాయకత్వం అవశ్యమని ప్రజలు గుర్తిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా వచ్చేది మన ప్రభుత్వమే, ఇందులో ఎటువంటి సందేహం లేదు" అని ఆయన కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు.

**నాయకత్వానికి దక్కిన నైతిక బలం**

ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో పాత తరం ఉద్యమకారులు మళ్లీ కేసీఆర్ గారి పక్షాన నిలబడటం విశేషం. రోషం బాలు వంటి వ్యక్తికి ఉన్న సామాజిక స్పృహ, ఫిలిం చాంబర్ మరియు పొలిటికల్ జేఏసీలో ఉన్న పట్టు పార్టీకి అదనపు బలాన్ని చేకూర్చనున్నాయి. జగిత్యాల వేదికగా జరిగిన ఈ కలయిక, రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో ఎటువంటి మార్పులకు శ్రీకారం చుడుతుందో వేచి చూడాలి.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

**కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తే ఇదా శిక్ష**

**భావోద్వేగానికి గురయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి**

**జగిత్యాల, ఏప్రిల్20 :**

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.
జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

**కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తే ఇదా శిక్ష**

**భావోద్వేగానికి గురయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి**

**జగిత్యాల, ఏప్రిల్20 :** క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు. జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

## సమక్షంలో బిఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి

**కండువాకప్పి ఆహ్వానించిన కెసిఆర్**

జగిత్యాల, : ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తన అనుచరులతో కలిసి భారత రాష్ట్ర సమితి లో చేరారు. ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ స్వయంగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన జీవన్ రెడ్డి ప్రధాన అనుచరులు, స్థానిక నాయకులు కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. జీవన్ రెడ్డి వంటి అనుభవజ్ఞులైన నేత రాకతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# పుట్టిన రోజున వెల్లివిరిసిన మానవత్వం

:- చంద్రపాల్ దంపతుల ఆదర్శం

:- నిరుపేద కుటుంబానికి నిత్యావసరాల సరుకులు అందజేత





**రామగుండం,ఏప్రిల్ 20 :-**

తన సతీమణి పుట్టినరోజున ఓ నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తం అందించాలనే ఆలోచన రావడం అభినందనీయమని పోతుల చంద్రపాల్–నీనా మార్గరెట్ దంపతులు, కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.సోమవారం స్థానిక చంద్రశేఖర్ నగర్ కు చెందిన పోతుల నీనా మార్గరెట్ పుట్టినరోజును పురస్కరించుకొని భర్త, సింగరేణి విశ్రాంత ఉద్యోగి, ఓసి–1 ఈపీ ఆపరేటర్, కళాకారుడు,క్రీడాకారుడు చంద్రపాల్, కుటుంబ సభ్యులు జ్యోతి గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గంగానగర్ లోని లారీ డ్రైవర్ మమతగిరి సతీష్ కుటుంబానికి 25 కిలోల బియ్యం,నిత్యవసర సరుకులు, స్వీట్లు అందజేశారు.లారీ డ్రైవర్ సతీష్ గత ఐదు సంవత్సరాల క్రితం ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి,కాళ్ళు చచ్చుబడి పడకకే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ భారంగా మారిన ఆ కుటుంబం గురించి తెలిసిన చంద్రపాల్ తన సతీమణి నీనా మార్గరెట్ పుట్టినరోజు పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి సతీష్ ఇంటికి వెళ్లి 25కిలోల బియ్యం,నిత్యవసర సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టినరోజున బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు వేడుకలు ఆర్భాటంగా చేసుకోవడంకన్నా, నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తం అందించాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు.ఇది స్ఫూర్తిగా తీసుకొని మరింతమంది తమ పుట్టినరోజు, వివాహ దినోత్సవం సందర్భంగా సమాజంలో సాయం కోసం ఎదురుచూస్తున్న వారిని ఇతోధికంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే ముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ గా ఎన్నికైన గంగానగర్ వాసి ఇండ్ల కృష్ణవేణిని ఆత్మీయంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నీనా మార్గరెట్ తో పాటు చంద్రపాల్ కుటుంబ సభ్యులు జాన్ ఈవెన్,శాంతి నిరీక్షణ,ఫౌండేషన్ నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ,మేజిక్ రాజా,హరి, అంజన్న,బోడకుంట వెంకట్రాజం, వెంకటలక్ష్మి, తిరుపతి, సిద్ధూ,సతీష్ భార్య ఉమ తదితరులున్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలని ప్రారంభించిన భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ ఏప్రిల్ 20**

వలిగొండ మండలంలోని పహిల్వాన్పురం, మాందాపురం, నాతాళ్ళగూడెం, అక్కంపల్లి, లింగరాజుపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.గత సంవత్సరంలో సుమారు 3 లక్షల 77 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే గారు, ఈ సంవత్సరం సుమారు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు వడ్లపై క్వింటాల్కు 500 బోనస్ అందిస్తున్నామని వెల్లడించారు. ఈ చర్య రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తుందని అన్నారు.కొనుగోలు కేంద్రాలలో గన్నీ



బ్యాగులు, తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, ధాన్యం తేమ శాతం పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర కనీస సదుపాయాలు కల్పించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఐకేపీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని సీపీఐ, ఏఐటీయూసీ డిమాండ్

**మేడ్చల్ ఏప్రిల్ 20**

మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాల యాలలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను తక్షణమే పెంచాలని సీపీఐ, ఏఐటీయూసీ డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్లో డేటా ఎంట్రీ, ఫైళ్ల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, సహాయక సేవలు వంటి కీలక బాధ్యతలు నిర్వర్తి స్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులు జిల్లా పరిపాలనకు వెన్నెము కలుగా నిలుస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయాల నేపథ్యంలో వారికి లభిస్తున్న తక్కువ వేతనాలతో జీవనం కష్టంగా మారిందన్నారు. చాలామంది నెలకు రూ.15 వేలలోపు వేతనం తీసుకుంటూ, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ కనీసం 50 శాతం జీతాల పెంపు వెంటనే అమలు చేయాలని, సేవలను క్రమబద్ధీకరించి శాశ్వత ఉపాధి కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు చేపడతామని హెచ్చరించారు.

# సింగరేణి స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**రామగుండం,ఏప్రిల్ 20**



సింగరేణి సంస్థకు చెందిన స్థలములో జరుగుతున్న అక్రమ కట్టడాలపై యాజమాన్యం కఠిన చర్యలు చేపట్టింది.సింగరేణి ఏవిక్షన్ డెమోలేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 18 శనివారం రోజున మిలీనియం క్వార్టర్ కు వెళ్లే దారిలో ఉన్న ఫరూఖ్ కార్ వాషింగ్ సెంటర్ వద్ద సింగరేణి స్థలములో నిర్మించిన కొత్త అక్రమ నిర్మాణాన్ని,ఎస్టేట్స్ డిపార్ట్మెంట్ వారు సెక్యూరిటీ డిపార్ట్ మెంట్ సహాయంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగినది. ముఖ్యంగా విలువైన సింగరేణి భూములను అక్రమంగా ఆక్రమించి నిర్మించే కట్టడాలను ఎస్టేట్స్ మరియు సెక్యూరిటీ విభాగాలు సంయుక్తంగా అడ్డుకుంటున్నాయి. "సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందస్తు అనుమతులు తప్పనిసరి. అనుమతి లేని అక్రమ కట్టడాలను ఎప్పటికప్పుడు గుర్తించి నిర్దాక్షిణ్యంగా తొలగిస్తాం.ఆక్రమణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి వెనకాడబోం." అని అధికారులు తెలిపారు.

# జగిత్యాల సభకు తరలిన బిఆర్ఎస్ నాయకులు

**రామగుండం,ఏప్రిల్ 20**



బిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి సీఎం కెసిఆర్ జగిత్యాలలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి ని బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానం పలికే భారీ బహిరంగ సభకు రామగుండం నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ నాయకులు బయలుదేరారు.వారిలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోపు ఐల్లయ్య యాదవ్,6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్,గంగానగర్ పట్టణ అధ్యక్షులు అచ్చే వేణు,అల్లం ఐల్లయ్య,మేకల కొమురన్న,కలవేన రవీందర్,జనగామ బొడ్డు మహేందర్,సిద్ద తిరుపతి,అరేళ్ళ రవితేజ,జనగామ సంతోష్ తో పాటు తదితరులు ఉన్నారు.

# మల్యాల గ్రామ అభివృద్ధే లక్ష్యం..సర్పంచ్ రమాదేవి శంకర్..

**యాదాద్రి భువనగిరి జిల్లా**

బొమ్మల రామారం మండలంలోని మల్యాల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు



సోమవారం గ్రామ సర్పంచ్ పోచంపల్లి (దొమ్మాట) రమాదేవి శంకర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి శంకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హెచ్ఎండీఏ నిధుల ద్వారా రూ. 34.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు,అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయిని గ్రామ అభివృద్ధికి వినియోగిస్తూ,గ్రామంలోని సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.గ్రామ అభివృద్ధే తమ ధ్యేయమని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, నాయకులు పోలగౌని వెంకటేష్ గౌడ్,సింగిర్తి మల్లేశం,బోనంకుర మల్లేశం,మైలారం సుదర్శన్,బేతాళ రామాంజనేయులు,ఊట్ల రమేష్, పోలగౌని కృష్ణ,శ్రీరాములు,గుండు నవీన్,ప్రభు, రాములు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co